

కొండలు, కోనలు, వంకలు, నదులు దాటుకుంటూ... పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ... ఒక యాత్ర చేయాలంటే పరిస్థితులు అనుకూలించాలి, వాతావరణమూ సహకరించాలి. బస్సులోనో, కారులోనో, బైక్‌పైనో వెళ్లడం ఒక ఎత్తయితే... సైకిల్‌పై అలాంటి యాత్రకు పూనుకోవాలంటే ఎంతో పట్టుదల, దృఢ సంకల్పం ఉండాలి! అలాంటి సాహసయాత్రే చేస్తున్నాడు సంగారెడ్డి జిల్లా సిరూర్ యువకుడు తుకారాం అలియాస్ రామ్‌యాదవ్. పరమేశ్వరుడి దర్శనానికై.. పర్వతాలు దాటుతూ ప్రస్తుతం వర్షాలు దంచికొడుతున్న వేళ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ మొక్కవోని ధైర్యంతో కేదార్‌నాథ్ వైపు సాగుతున్న ఈ యువ సైక్లిస్ట్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తి..

సాహసం శ్వాసగా..

సైకిల్‌పై కేదార్‌నాథ్‌కు సిరూర్ యువకుడు

నా బర్త్‌డే వేడుకలు జరుపొద్దు.. ఫ్లెక్సీలు కట్టవద్దు


సిగాచి పరిశ్రమలో శిథిలాల తొలగింపును పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

రేపు జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నా
సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 40మంది చనిపోయారు
సహాయక చర్యలు కొనసాగుతున్నందునే ఈ నిర్ణయం
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, జూలై 5: ఈ నెల 7వ తేదీన తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ ఏటా 7వ తేదీన తన కూతురు జయారెడ్డి బర్త్‌డేతోపాటు తన బర్త్‌డేను కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహిస్తుంటారని గుర్తుచేశారు. ఈసారి వేడుకలు జరపవద్దని, ఫ్లెక్సీలు కట్టవద్దని సూచించారు. పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 40 మంది చనిపోవడం తనను కలచివేసిందన్నారు. ఇంకా అక్కడ సహాయక చర్యలు జరుగుతున్నాయని.. అందుకే వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకీ ఇప్పటిదాకా కానరాలేదు. ప్రమాదం జరిగి ఆరురోజులు గడుస్తున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులు దిక్కుతోచని స్థితిలో దీనంగా ఎదురుచూస్తున్నారు. లభించిన మృతదేహాలు తమవాళ్లవి కావనే విషయం కొంత ఓదార్పునిచ్చినప్పటికీ.. ఇంతకూ వాళ్లు ఎక్కడున్నారనే అంశం అంతుబట్టకుండా మారింది. అధికార యంత్రాంగం కూడా ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. తమవాళ్లు బతికివస్తారనే ఆశతో ఆరురోజులుగా నిద్రాహారాలు మాని కన్నీటి జాగరణ చేస్తున్నారు.


పాశమైలారంలోని ఐలా భవన్ పరిసరాల్లో దీనంగా ఎదురుచూస్తున్న కార్మికుల కుటుంబసభ్యులు

కన్నీటి జాగరణ

తమవాళ్ల ఆచూకీ కోసం పడిగాపులు
స్థానిక ఐలా భవన్‌లో ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు
ఆరురోజులుగా నిద్రాహారాలకు దూరం
నేటికీ తెలియని తొమ్మిది మంది ఆచూకీ
నిర్మానుష్యంగా సిగాచి పరిశ్రమ పరిసరాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 5: గత నెల 30వ తేదీ సోమవారం రోజున ఉదయం 9.27 గంటలకు సిగాచి పరిశ్రమలో ప్రమాదం సంభవించింది. ఇప్పటికే ఆరురోజులు గడిచిపోయింది. సంఘటన జరిగిన మరుక్షణం నుంచే అక్కడ సహాయక చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు 40 మంది చనిపోయినట్లు అధికారులే ప్రకటించారు. సంఘటన జరిగిన సమయంలో 143 మంది ఉండగా 60 మంది సురక్షితంగా బయటపడ్డారు. గాయాలతో 34 మంది ఆస్పత్రుల్లో చేరగా 12 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో ఇంకా 9 మంది ఆచూకీ తెలియరావాల్సి ఉంది.


నిర్మానుష్యంగా మారిన సిగాచి పరిశ్రమ పరిసరాలు

ఆరు రోజులుగా ఎదురుచూపులు

తమవాళ్లు బతికేవస్తారనే ఆశ ఇంకా వారిలో చావడం లేదు. ఓవైపు గల్లంతైన కార్మికుల గురించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కార్మికుల బంధువులు మాత్రం దీనంగా ధీమాతో ఎదురుచూస్తున్నారు. ఏడ్చి ఏడ్చి తమ కన్నీళ్లు సైతం ఇంకిపోయాయని గల్లంతైన కార్మికుడు జస్టిన్ తండ్రి గాలప్ప రోదించాడు. మూడురోజుల క్రితమే తన కొడుకు ఈ కంపెనీలో చేరాడని, ఇంతలోనే మృత్యువు కబళించిందని ఆవేదనకు లోనయ్యాడు. ఇలా గల్లంతైన కార్మికుల బంధువులు తమ కన్నీటి గాథలు

మిగతా 7వ పేజీలో

వీళ్లెమయ్యారో..

తొమ్మిది ఆచూకీ విషయమే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాకుళంకు చెందిన వెంకటేశ్, బండ్లగూడ వాసి జస్టిన్, ఒడిసా రాష్ట్రానికి చెందిన రమేశ్‌గోండ్, పూర్ణచంద్ర సాహో, బీహార్ రాష్ట్రానికి సంబంధించిన శివాజీ కుమార్, ఇర్ఫాన్ అన్సారి, శివ్‌జీతోపాటు మరో ఇద్దరు కానరాకుండా పోయారు. సుదీర్ఘకాలంగా ఇదే సిగాచి పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నవారే వీరంతా. ఆరోజు ఉదయాన్నే పనుల్లోకి వెళ్లినట్లుగా రికార్డుల్లో పేర్లు ఉన్నాయి. కానీ ఆస్పత్రుల్లో లేరు. మృతదేహాల డీఎన్ఏ పరీక్షల్లోనూ వీరి అవశేషాలు బయటపడలేదు. ఆరురోజుల పాటు శిథిలాల్లో గాలించినా వీరికి సంబంధించిన ఎలాంటి ఆచూకీ తెలియలేదు. దీంతో ఈ కార్మికుల విషయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కార్మికుల బంధువులు, కుటుంబసభ్యులను ఓదార్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వారు వినడం లేదు.

అభివృద్ధి పనుల పరిశీలన


హుస్నాబాద్ ట్యాంక్‌బండ్‌పై సుందరీకరణ పనుల నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పందిల్ల జాతీయ రహదారి హైలెవల్ బ్రిడ్జి పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పరిశీలించారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ట్యాంక్‌బండ్, హుస్నాబాద్ నుంచి రామవరం రోడ్డు పనులను మంత్రి పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ట్యాంక్‌బండ్‌కు సంబంధించిన సుందరీకరణ నమూనా మ్యాప్‌లను పరిశీలించి అధికారులతో పనుల పురోగతిపై చర్చించారు. త్వరంగా ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో రాంమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, అధికారులు తదితరులు ఉన్నారు.

ఉల్లాస్, టాస్ నమోదు పెంచాలి

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వయోజన విద్య (ఉల్లాస్) ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్(టాస్) నమోదు పెంచాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం అనంతరం మండల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన ప్రాస్పెక్టస్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డీఆర్‌పీ, ప్రధానోపాధ్యాయుల సహకారంతో ఉల్లాస్, టాస్ నమోదు టార్గెట్లను పూర్తి చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 11 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఉల్లాస్, టాస్ రాష్ట్ర బృంద సభ్యులతో కలిసి విద్యాధికారులు డీపీవో, డీఆర్డీవో, డీడబ్ల్యూవో, మహిళ సమాఖ్య సభ్యులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులను కలిసి అడ్మిషన్ల గడువు గురించి వివరించారు. సమావేశంలో వయోజన విద్య డీడీ వెంకట్‌రెడ్డి, స్వామి, ఏఎమ్‌వో భాస్కర్, ఏసీజీఈ లక్ష్మయ్య, రాష్ట్ర బృందం సభ్యులు విజయకృష, శివకృష్ణ, ఖాదీర్, మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

చిరుత సంచరించిన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

రాయపోల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లి ప్రాంతంలో చిరుతపులి సంచరించిన విషయం తెలిసిందే. శనివారం అటవీ శాఖ సిబ్బంది వడ్డెపల్లిని సందర్శించారు. చిరుతపులి సంచరించిన ప్రాంతానికి వెళ్లి పాద ముద్రలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌వో హైమద్ హుస్సేన్ మాట్లాడుతూ అటవీ సమీపానికి వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని, పొలాల వద్ద పశువులను కట్టేయవద్దని సూచించారు. ఈ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పేరుకే రైల్వేస్టేషన్.. సేవలేవి?

నిరుపయోగంగా దుద్దెడ రైల్వేస్టేషన్
కిటికీలు ధ్వంసం, గదుల్లో చెత్త
అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా స్టేషన్
దుద్దెడ నుంచి స్టేషన్‌కు మట్టి రోడ్డే దిక్కు



దుద్దెడ నుంచి స్టేషన్ వరకు ఉన్న మట్టి రోడ్డు, రైల్వేస్టేషన్ నుంచి ఆగకుండా వెళ్తున్న రైలు

కొండపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఎదురుచూసిన రైలు మార్గం వచ్చింది, రైలు రాకపోకలు మొదలయ్యాయి. కానీ దుద్దెడ శివారులోని రైల్వేస్టేషన్‌లో మాత్రం సేవలు మాత్రం ఇప్పటికీ అందని ద్రాక్షలా మిగిలి ఉన్నాయి. 20 నెలల క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన ఈ రైల్వేస్టేషన్ ప్రస్తుతం నిరుపయోగంగానే ఉన్నది.

అందుబాటులో లేని సౌకర్యాలు

లక్షలాది రూపాయలు


రైల్వేస్టేషన్ లోపల చెత్తాచెదారం, ధ్వంసమైన కిటికీ అద్దాలు

వెచ్చించి నిర్మించిన స్టేషన్ వినియోగంలోకి రాకపోవడంతో బోసిపోతోంది. టికెట్ కౌంటర్ సైతం ఇప్పటికీ ప్రారంభించలేదు. రైలు వస్తూ పోతున్నా, టికెట్లు ఇచ్చే అధికారులు లేకపోవడంతో దుద్దెడ ప్రజలకు రైలు ప్రయాణ సేవలు లభించడం లేదు. స్టేషన్ నిర్వహణ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీ అద్దాలను పగలగొట్టారు. స్టేషన్‌లోని టైల్స్‌ను ధ్వంసం చేశారు. స్టేషన్ గదులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నిర్మాణ సమయంలో వాడిన రాళ్లు, ఇసుక కూడా అక్కడే వదిలేసి వెళ్లారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పరిసర ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. దుద్దెడ నుంచి స్టేషన్ వరకు మట్టి రోడ్డు దిక్కు. స్టేషన్ రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నప్పటికీ, ప్రజలు చుట్టూ తిరిగి కలెక్టరేట్ సమీపంలోని దర్గా రోడ్డు మీదుగా వెళ్లాల్సి వస్తోంది.

ఉపయోగమేదీ?

సిద్దిపేట నుంచి దుద్దెడ, కుకునూరుపల్లి, కొడకండ్ల, గజ్వేల్ మీదుగా కొత్తపల్లి, మనోహరాబాద్ ద్వారా సికింద్రాబాద్ వరకు 116 కిలోమీటర్ల రైలు సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రయాణానికి సుమారు నాలుగు గంటలు పడుతుంది. టికెట్ ధర రూ.30 ఉంది. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రైలు రాకపోకలు జరుగుతున్నాయి. కానీ స్టేషన్ అందుబాటులోకి రాలేదు. రైల్వేస్టేషన్ వస్తే వ్యాపారాలు పెరుగుతాయని, తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చని ఆశించిన స్థానిక ప్రజలకు పూర్తి సేవలు అందకపోవడంతో నిరాశలోనే ఉండిపోయారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టేషన్ పూర్తిస్థాయి సేవలు అందించి, మౌలిక వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు రైల్వే అధికారులను, ప్రభుత్వ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు.

రుచి, శుచి పాటించాలి

● కలెక్టర్ హైమావతి.. కొనసాగిన గురుకులాల తనిఖీ

సిద్దిపేట రూరల్/కొండపాక/హుస్నాబాద్ రూరల్/కోహెడ/చేర్యాల/తొగుట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజన తయారీలో శుభ్రత పాటించి, నాణ్యతతో రుచికరంగా చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులకు సూచించారు. జిల్లాలోని గురుకులాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హైమావతి శనివారం కూడా కొనసాగించారు. కలెక్టర్ సిద్దిపేటరూరల్ మండలం చింతమడకలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలను పరిశీలించారు. కొండపాకలోని మెదక్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం, జూనియర్ కళాశాలలను, కొండపాక మండల కేంద్రంలోని బాలికల, దుద్దెడలోని బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని బాలికల గురుకులం, జిల్లెలగడ్డలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల, కళాశాల, హుస్నాబాద్‌లోని మైనార్టీ గురుకులం పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. కోహెడ మండలంలోని బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆమె పరిశీలించారు. చేర్యాల మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాలను, తొగుటలోని గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి గురుకులాల్లోని వంటగదుల్లో వంటల తయారీని పరిశీలించి భోజనం, కూరలను రుచి చూసి పలు సూచనలు చేశారు. పలుచోట్ల విద్యార్థులతో స్వయంగా మాట్లాడి ఆహారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌లను ఆమె పరిశీలించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామని బెంగపడవద్దని, శ్రద్ధగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. పలు గురుకులాల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన ఫోన్ సౌకర్యాన్ని కలెక్టర్ ప్రశంసించారు. ఈ విస్తృత తనిఖీల్లో ఆమె వెంట ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.


హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన

మనూరు/నాగల్‌గిద్ద, 5(ఆంధ్రజ్యోతి):మనూరు మండల పరిధిలోని రాణాపూర్, తుమ్నూర్ గ్రామాల్లో రైతులకు ఆయిల్‌పాం, ఉల్లి పంటల సాగుపై రైతులకు శనివారం ఉద్యానవన శాఖ అధికారి మౌనికరెడ్డి అవగాహన కల్పించారు. ఉల్లి సాగుకు ఎకరానికి రూ.8వేల సబ్సిడీ, అయిల్‌పాం సాగుకు ఎకరానికి రూ.50,918 సబ్సిడీ రూపంలో అందజేస్తున్నట్లు చెప్పారు.

అన్నను హతమార్చిన తమ్ముడు

● అల్లుడు, బావలతో కలిసి హత్య

● ఆస్తి, భూతగాదాలే కారణం

జోగిపేటరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రక్త సంబంధాన్ని మరిచి భూమి కోసం సొంత అన్ననే తమ్ముడు హతమార్చిన కేసును పోలీసులు చేధించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట సర్కిల్ కార్యాలయంలో శనివారం సీఐ అనిల్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. వటపల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన లింగయ్యకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు అయ్యి ఎవరి వారు వేరుగా జీవనం సాగిస్తున్నారు. చిన్నవాడైన మల్లేశం అదే గ్రామానికి ఇల్లరికం వెళ్లాడు. మల్లేశం తన తండ్రి నుంచి తనకు రావాల్సిన ఆస్తి కోసం తరుచూ ఇద్దరు అన్నలు సాయిలు, తిరుమలేష్‌తో గొడవ పడేవాడు. పెద్దన్న సాయిలు, చిన్నన్న తిరుమలేష్‌కు అండగా ఉంటున్నాడని సాయిలుపై మల్లేశం కోపం పెంచుకున్నాడు. అతన్ని ఎలాగైనా చంపేయాలని భావించాడు. గత నెల 18న సాయిలు తన పొలం పనులు చూసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో మల్లేశం, అతని బావలు లింగయ్య, సురేష్, అల్లుడు మహేష్ అడ్డుకుని అందోల్ మండలం తాలేల్మ గట్టుపై దారుణంగా హతమార్చారు. అక్కడే ఉన్న రేణుకా ఎల్లమ్మ ఎత్తిపోతల పథకం కెనాల్ కాలువలో గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. పొలానికి వెళ్లిన సాయిలు తిరిగి రాకపోవడంతో అతని భార్య గత నెల 26న వటపల్లి పోలీసులను ఆశ్రయించింది. తన మరిది మల్లేశంపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు తెలియజేయడంతో అతన్ని విచారించగా హతమార్చినట్లు ఒప్పుకున్నాడు.

మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

రేణుకా ఎల్లమ్మ తల్లి ఎత్తిపోతల పథకం కెనాల్ కాలువలో గొయ్యి తీసి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని శనివారం పోలీసులు కుటుంబసభ్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో వెలికితీశారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. హత్యకు కారకులైన నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేలూర్ శివారులో వ్యక్తి దారుణ హత్య

● మారణాయుధాలతో గుర్తుతెలియని వ్యక్తుల దాడి

● ఆధారాలు సేకరించిన క్లూస్ టీం

వర్గల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన వర్గల్ మండలం వేలూర్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలూర్‌కు చెందిన రాయన్న నర్సయ్య (65) తనకున్న కొద్దిపాటి పొలం కౌలుకు ఇచ్చాడు. కౌలుదారుడు వరి నారు తీసుకుని రమ్మనడంతో నర్సయ్య సైకిల్‌పై నారు తీసుకుని బయలుదేరాడు. గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో అతనిపై దాడి చేసి హతమార్చారు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డితోపాటు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఏసీపీ నర్సింలు చేరుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుల ఆచూకీ కోసం క్లూస్ టీం బృందంతో ఆధారాలు సేకరిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



భూపాల్ (ఫైల్)

హవేళిఘణపూర్, జూలై5 (ఆంధ్రజ్యోతి); ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం శాలిపేట గ్రామానికి చెందిన పచ్చంటి భూపాల్ (42) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబపోషణ నిమిత్తం అప్పులు చేశాడు. వాటి తీర్చే మార్గం లేకపోవడంతో శుక్రవారం పొలం దగ్గర గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొం దుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుని భార్య మంజుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మెదక్ టౌన్ ఎస్ఐకి గాయాలు

పాపన్నపేట జూలై 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎస్ఐకి గాయాలైన సంఘటన పాపన్నపేట మండలం ఏడుపాయల కమాన్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పాపన్నపేట మండలం నార్సింగికి చెందిన విఠల్ మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా కమాన్ వద్ద ఉన్న పెట్రోల్‌బంక్ వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో మెదక్ ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పక్కటెముకలు విరగడంతో పాటు, తలకు బలమైన గాయాలైనట్లు తెలిసింది. ఈ క్రమంలో నర్సాపూర్ వద్దకు అంబులెన్స్ చేరుకోగానే అందులో ఆక్సిజన్ అయిపోయినట్లు తెలిసింది. అరగంట పాటు అతను ఇబ్బంది పడ్డట్లు సమాచారం.

అదుపు తప్పి కారు బోల్తా



నారాయణఖేడ్, జూలై5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ సమీపంలో శనివారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పంట చేనులో బోల్తా పడింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గమనించి కారును బయటకు తీసుకొచ్చారు.

నిత్యం ఏదో చోట ప్రమాదం

నారాయణఖేడ్ నుంచి ర్యాకల్, సిర్గాపూర్ మీదుగా మాసాన్‌పల్లి క్రాస్‌రోడ్డు వరకు సింగిల్ లేన్‌గా ఉన్న రోడ్డును డబుల్‌లేన్‌గా విస్తరించేందుకు రెండేళ్ల క్రితం రూ.16కోట్లు మంజూరు చేశారు. సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరుపక్కలా తవ్వి కంకర వేసి వదిలేశాడు. అసంపూర్తి పనులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ స్థానిక ప్రజలు, తాజా మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ అన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు.

సాహసం శ్వాసగా..

సైకిల్‌పై కేదార్‌నాథ్‌కు సిరూర్ యువకుడు





- ఐస్‌క్రీం బండి నుంచి ఆధ్యాత్మిక యాత్రల వైపు
- పర్వతాలను దాటుతూ.. ప్రకృతిని ఆస్వాదిస్తూ..
- గతేడాది 11 జ్యోతిర్లింగాల దర్శనం
- ఈసారి కేదార్‌నాథ్, బద్రీనాథ్‌కు ప్రయాణం
- కాలుష్య నియంత్రణ, గోసంరక్షణపై అవగాహన
- యువతకు ఆదర్శం సైక్లిస్ట్ రామ్‌యాదవ్

బాల్యంలో కష్టాల కడలిని ఈదిన ఆ యువకుడు ప్రస్తుతం భక్తి, పట్టుదలతో దేశంలోని పుణ్యక్షేత్రాలను సైకిల్‌పైనే సందర్శిస్తున్నాడు. గత ఏడాది 11 జ్యోతిర్లింగాలను దర్శించగా, ఇప్పుడు కేదార్‌నాథ్, బద్రీనాథ్ యాత్రలో ఉన్నాడు. ప్రతికూల వాతావరణాన్ని అధిగమిస్తూనే ప్రకృతిని ఆస్వాదిస్తూ ముందుకు సాగుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

- జోగిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి)

అందోలు నియోజకవర్గం, రాయికోడ్ మండలం, సిరూర్ గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు తుకారాం అలియాస్ రామ్ యాదవ్ రెండేళ్లుగా సైకిల్‌పై యాత్రలు చేస్తున్నాడు. గతేడాది 11 జ్యోతిర్లింగాల దర్శనం పూర్తిచేసిన అతడు ఈసారి కేదార్‌నాథ్, బద్రీనాథ్ దర్శనం కోసం బయలుదేరాడు. ఈ యాత్ర ద్వారా శివయ్యపై తన భక్తిని చాటుకోవడంతో పాటు కాలుష్య నియంత్రణ, గోమాత రక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడమే తన లక్ష్యం అంటున్నాడు.

కష్టాల కడలి నుంచి..

రామ్‌యాదవ్ తండ్రి ఆకస్మిక మరణంతో కుటుంబ భారం తల్లిపై పడింది. తల్లి కష్టాన్ని చూసి చలించిపోయిన ఆయన చిన్నతనంలోనే హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. కూకట్‌పల్లిలో ఒక ఐస్‌క్రీం బండిని అద్దెకు తీసుకుని, ఐస్‌క్రీం అమ్ముతూ తల్లికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. ఇద్దరు చెల్లెళ్లకు వివాహం చేశాడు. ఒక్కసారి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తుండగా.. తాను కూడా ఒక ఐడీని క్రియేట్ చేసుకోవాలనే ఆలోచన్నే అతడి జీవితాన్ని మలుపుతిప్పింది. రామ్-యాదవ్-ఏఆర్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసుకుని ఐస్‌క్రీం అమ్మకాలు, హైదరాబాద్‌లో చూసిన విషయాలను అందులో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వ్యూస్ పెరగడంతో యూట్యూబ్ అకౌంట్‌నూ ప్రారంభించాడు. 12 సంవత్సరాలు పనిచేసిన అనంతరం కాస్త విరామం కోసం దేశమంతా చుట్టిరావాలని నిర్ణయించుకున్నాడు. తన ఐస్‌క్రీమ్ బండి సైకిల్‌పైనే యాత్రలు కొనసాగిస్తూ పలు విషయాలను ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ అకౌంట్లలో పోస్ట్ చేస్తూ పాపులర్ అయ్యాడు.

జ్యోతిర్లింగాల దర్శనం..

తల్లి నుంచి వారసత్వంగా అతడికి భక్తి చింతన అలవడింది. శివుడంటే అపారమైన భక్తితో 12 సార్లు శివమాల ధరించి శ్రీశైలం వెళ్లొచ్చాడు. ఈ సమయంలోనే అతడికి జ్యోతిర్లింగాలను దర్శించాలన్న కోరిక పుట్టింది. గత సంవత్సరం జ్యోతిర్లింగాల యాత్రకు శ్రీకారం చుట్టాడు. సైకిల్‌ను రైలులో అయోధ్యకు తీసుకెళ్లిన రామ్‌యాదవ్, అక్కడ బాలరాముడి దర్శనానంతరం గత ఏడాది జూలై 25న సైకిల్ యాత్రను ప్రారంభించాడు. అయోధ్య నుంచి వారణాసి (కాశీ)లో విశ్వేశ్వరుడి దర్శనంతో తన తొలి జ్యోతిర్లింగ దర్శనం పూర్తి చేసుకున్నాడు. అక్కడి నుంచి జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో వెలసిన వైద్యనాథ్ జ్యోతిర్లింగం, ఒడిశాలోని పూరీ జగన్నాథుడిని, మధ్యప్రదేశలోని ఓంకారేశ్వర్, ఉజ్జయిని మహాకాళేశ్వర్‌లను దర్శించుకుని, గుజరాత్‌లోని నాగేశ్వర్, సోమనాథ్ జ్యోతిర్లింగాలను చూసి తన్మయత్వం పొందాడు. అక్కడి నుంచి ద్వారక వెళ్లి, మహారాష్ట్రలోని నాసిక్‌లో త్రియంబకేశ్వరుడిని, వేరూల్‌లోని ఘ్రిష్ణేశ్వర్‌తోపాటు భీమాశంకర్ జ్యోతిర్లింగాలను కూడా దర్శించుకున్నాడు. అటు నుంచి శ్రీశైలం చేరుకుని మల్లికార్జునుడి ఆశీస్సులు పొంది తన సైకిల్‌పై తన తొలి యాత్రను ముగించాడు.

ఈసారి కేదార్‌నాథ్‌కు సైకిల్ యాత్ర

కేదార్‌నాథ్ జ్యోతిర్లింగం యాత్ర చేయాలన్న సంకల్పాన్ని ఈ ఏడాది శ్రీకారం చుట్టాడు. గత నెల 5న తన సొంత గ్రామమైన సిరూర్ నుంచి బయలుదేరి మొదటగా ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకుని, అక్కడి నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మధుర, ఉత్తరాఖండ్‌లోని హృషికేశ్ (రిషికేశ్) మీదుగా కేదార్‌నాథ్, బద్రీనాథ్ యాత్రను సైకిల్ కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో, కేదార్‌నాథ్ ధామ్‌కు సమీపంలోని గౌరీకుండ్‌లో ఉన్నాడు. ఒక రోజులో కేదార్‌నాథ్‌లో దర్శనం, మరో 10 రోజుల్లో బద్రీనాథ్‌లో నారాయణుడి దర్శనం చేసుకుని తిరిగి వస్తానని చెబుతున్నాడు.

ఇష్టం ముందు ఎంత కష్టమైనా చిన్నదే..

ప్రతికూల వాతావరణ పరిస్థితులు నిత్యం సవాలు విసురుతుంటాయి. పర్వతాలు, కొండలు, కోనల్లో సైకిల్‌పై ప్రయాణం కష్టంతో కూడుకున్నదే. వారం రోజులుగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. విపరీతమైన చల్లని గాలులు, ఒకవైపు కొండచరియలు విరిగిపడడం మరోవైపు ఇబ్బంది పెడుతున్నాయి. అయినా, శివయ్య మీద ఉన్న భక్తి, ఇష్టం ముందు ఇవన్నీ చిన్నవిగానే కనిపిస్తున్నాయి.

-సైక్లిస్ట్ రామ్‌యాదవ్ (తుకారాం)





రెండేళ్ల బాలుడిపై పడిన వేడి గంజి

- చికిత్స పొందుతూ మృతి



మోక్షిత్(ఫైల్)

వర్గల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని రెండేళ్ల చిన్నారిపై వేడి అన్నం గంజి పడి తీవ్ర గాయాలపాలై, చివరకు మృత్యువాత పడ్డాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన ముత్తి మహేశ్వరి, స్వామి దంపతులకు రెండేళ్ల కుమారుడు మోక్షిత్ ఉన్నాడు. ఈ నెల 2న మోక్షిత్ ఇంటి పక్కనే ఉన్న పెద్ద నాన్న ముత్తి ఎల్లం ఇంటికి ఆడుకోవడానికి వెళ్లాడు. వారి ఇంట్లో వేడి చేసిన అన్నం గంజిని పాత్రలో పోసి ఉంచారు. అది గమనించని బాలుడు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు కాలు గంజి పాత్రకు తగలడంతో, అందులోని వేడి గంజి శరీరంపై పడి వీపు వెనుక భాగానికి చర్మం కాలి బొబ్బలు వచ్చాయి. తీవ్ర గాయాలైన చిన్నారిని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



అన్వర్(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అవుసులపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ అన్వర్ (32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతను, మనస్తాపానికి గురై రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అతని భార్య అస్మా, అన్వర్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య అస్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

భూ వివాదంతో రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రైతు

నిజాంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తన సొంత భూమిని మరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారన్న బెంగతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిజాంపేట మండలం కల్వకుంటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొడిగె రామస్వామికి చెందిన మూడెకరాల భూమిని పాలివాళ్లు తమ పేరిట పట్టా చేసుకున్నారని కొన్నాళ్లుగా పంచాయితీ నడుస్తోంది. ఎంతకూ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామస్వామి, శుక్రవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అల్ప్రాజోలం పట్టివేత

పెద్దశంకరంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తులూరు గ్రామ శివారులో భానుగోని గోపాల్‌గౌడ్ వద్ద నుంచి నిషేధిత అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఉత్తులూరు శివారులో గోపాల్‌గౌడ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. బ్యాగులో కల్లులో కలిపే నిషేధిత అల్ప్రాజోలం 38 గ్రాముల ప్యాకెట్, 11 గ్రాముల ప్యాకెట్ లభించాయి. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్ప్రాజోలం ప్యాకెట్లు



కోహెడ: బస్వాపూర్‌లో పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



నిజాంపేటలో..



మెదక్ పట్టణం చమన్ వీధిలో..

నిజాంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగను హిందూ, ముస్లింలు సోదరభావంతో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మొహర్రం పండుగ సందర్భంగా తొమ్మిదో రోజు పీర్ల ఊరేగింపును డప్పు చప్పుళ్ల మధ్య వీధి వీధిన నిర్వహించారు. కుడుకలు, మలీద ముద్దలు, దట్టీలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం మల్కా చెరువులో నిమజ్జనంచేసి మొహర్రం పండుగను ముగిస్తారు.

బస్వాపూర్‌లో..

కోహెడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శనివారం మొహర్రం పండుగ (పీర్ల)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటలకే పీర్లను ఎత్తుకుని గుండం (అల్వ) చుట్టూ నడిచారు. అనంతరం గ్రామాల్లో డప్పు చప్పుళ్ల మధ్య వీధుల్లో తిరుగుతూ పీర్లతో ఊరేగింపు నిర్వహించారు.

మాతం నిర్వహించిన ముస్లింలు

మెదక్ కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చామన్ వీధిలో ముస్లిం పెద్దలు, మహిళలు, యువకులు పీర్ల ఊరేగింపు, నల్ల బట్టలు ధరించి మాతం నిర్వహించారు. హసన్, హుస్సేన్ లను స్మరిస్తూ విషాద గీతాలు ఆలపిస్తూ చేసిన తప్పులు మన్నించమని వేడుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం షర్బత్ వితరణ చేశారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య

- ధర్మారెడ్డిపల్లి మర్డర్ కేసు ఛేదించిన పోలీసులు
- చోరీ సొత్తు, ఫేక్ నంబర్ ప్లేట్లు స్వాధీనం



నిందితుడిని అదుపులోకి తీసుకున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

గజ్వేల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగల కోసం వృద్ధురాలిని నరికి చంపాడో నిందితుడు. ధర్మారెడ్డిపల్లి మర్డర్ కేసును పోలీసులు ఛేదించారు. వివరాలను గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులు శనివారం వెల్లడించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన కిచిగారి శంకర్(36) ఈ నెల 24న గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి రైల్వే ట్రాక్ వద్ద వృద్ధురాలు నల్ల సత్తమ్మ ఒంటరిగా వెళ్తుండగా గమనించాడు. ఆమె మెడలోని నగలను చూసి, సత్తమ్మను వెంబడించి పొలం వద్ద ఆమెను అత్యంత కిరాతకంగా నరికి, మెడలోని బంగారు గొలుసు, చెవి కమ్మలు, వెండి వస్తువులను అపహరించుకుపోయాడు. ఈ ఘటనపై నల్ల సత్తమ్మ కుమారుడు నల్లా మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 150 సీసీటీవీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సత్తమ్మను నరకడానికి ఉపయోగించిన కొడవలి, బంగారు గొలుసు, చెవి కమ్మలు, మొబైల్ ఫోన్, మూడు బైక్‌లు, రెండు యాక్టివాలు, రెండు ఫేక్ నంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన గజ్వేల్ ఏసీపీ నర్సింలు, ఇన్‌స్పెక్టర్లు సైదా, ముత్యంరాజు, సిబ్బంది యాదగిరి, కానిస్టేబుల్ రవి, వెంకటేశ్, నరేందర్‌గౌడ్, వెంకన్న, స్వామి, దివ్య, ఐటీ కోర్ టీం శ్రీకాంత్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అభినందించి, రివార్డు ప్రకటించారు.

ఘనంగా ఆషాఢి త్రిరాత్రోత్సవాలు



విద్యాశంకర భారతి స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ చైర్మన్ రసరాజుశర్మ

మర్కుక్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాండురంగ ఆశ్రమంలో 94వ ఆషాఢి త్రిరాత్రోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వస్తి పుణ్యాహవచనంతో క్రతువు మొదలైంది. పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి విశిష్ట అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం త్రిరాత్రోత్సవాల్లో భాగంగా అఖండ భగవాన్ నామ క్రతువు సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. హార్మోనియం, తాళాలు, తబలాలతో భక్తులు తన్మయత్వంతో పాండురంగని భజనలో లీనమయ్యారు. మరోవైపు స్వామివారికి గోక్షీరాభిషేకం, విశేష అభిషేకం, లక్ష పుష్పార్చన, పురుష సూక్త అర్చన వైభవోపేతంగా జరిగాయి. భక్తులు అందరూ స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నేడు తొలి ఏకాదశి కావడంతో ఆదివారం నిరంతరం స్వామి దర్శనం అందుబాటులో ఉంటుందని, భక్తులకు స్నానం, ఆహారం, తేనీరు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ రసరాజుశర్మ, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా పూరీ జగన్నాథుడి రథయాత్ర

కంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఎస్టేట్ ఆవరణలో పూరీ జగన్నాథుడి రథయాత్రను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణువు అవతారంగా భావించే జగన్నాథుని రథాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. రథాన్ని చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. శాస్త్రోక్తంగా, భక్తుల కోలాహలం మధ్య, భజనలతో, భక్తి గీతాలు ఆలపిస్తూ ఓడీఎఫ్ వీధుల్లో జగన్నాథుడి రథయాత్ర కొనసాగింది. ఒడిశా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో ప్రతీ ఏటా ఆషాఢ మాసం శుక్లపక్షం రెండో రోజున అంగరంగ వైభవంగా జరిగే జగన్నాథుడి రథయాత్రను జరుపుకోవడం వల్ల ఎన్నో తీర్థయాత్రలకు వెళ్లివచ్చిన ఫలితాలు కలుగుతాయని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



పూరి జగన్నాథుడి రథానికి పూజలు చేస్తున్న భక్తులు

కన్నీటి జాగరణ

(5వ పేజీ తరువాయి)

చెప్పుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకున్నారు. అధికారులు ఇక్కడ భోజనవసతులు, ఇతర ఏర్పాట్లు చేశారు. కానీ వీళ్లు నిద్రాహారాలు మానుకున్నారు. ఏ క్షణాన ఏ విషయం వినాల్సి వస్తుందోనని వణుకుతున్నారు. ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమై కనిపిస్తున్నారు.

నిర్మానుష్యంగా సిగాచి..

ఐదారురోజులుగా వందల మంది జనాలతో కిక్కిరిసిన సిగాచి పరిశ్రమ పరిసరాలు నేడు చిన్నబోయి నిర్మానుష్యంగా మారాయి. సోమ, మంగళవారాల్లో వందల సంఖ్యల మంది ఘటనను చూసేందుకు తరలి వచ్చారు. ప్రభుత్వ అధికారులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు, స్థానిక జనాలతో ఈ ప్రాంతమంతా రద్దీగా మారిపోయింది. మృతదేహాలను తరలించడం, గాలింపు చర్యలు సైతం తుది దశకు చేరడంతో ఇటువైపు వచ్చేవారు కరువయ్యారు. అప్పుడప్పుడు గల్లంతైనవారి కుటుంబ సభ్యులు మాత్రం దీనంగా పరిశ్రమ చుట్టూ తిరుగుతున్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్యం ఫలితమే సిగాచి ఘటన

- ఎంపీ రాజారాం సింగ్



పరిశ్రమలో వివరాలు సేకరిస్తున్న ఎంపీ రాజారాం సింగ్

పటాన్‌చెరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల నిర్వీర్యం ఫలితమే సిగాచి ఘటన అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంట్ సభ్యుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ రాజారాం సింగ్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆయన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మనోజ్ మంజిల్‌తో పాటు నైనాలశెట్టి మూర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యాక్టరీ యజమాన్యాల పట్ల ప్రభుత్వాలు ఉదార వైఖరి అవలంబించడం వల్లే కార్మికులు శ్రమ దోపిడీకి గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సిగాచి ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ ఘటనకు బాధ్యత వహించి కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు వీరునాయక్, ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి రాజు, నాయకులు మహంకాళి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం

పటాన్‌చెరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌లైన్ ద్వారా సిగాచి బాధితుల కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) పద్మజారాణి తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 166 కాల్స్ వచ్చాయన్నారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలుసుకునేందుకు, డీఎన్‌ఏ పరీక్షల వివరాల కోసం ఎక్కువగా ఫోన్‌లు వస్తున్నాయని చెప్పారు. శనివారం 39 ఫోన్‌కాల్స్ వచ్చాయన్నారు. బాధితుల కుటుంబ సభ్యులు తక్షణ సమాచారం కోసం 08455-276155 నంబర్ ద్వారా సంప్రదించాలని ఆమె సూచించారు.

న్యూస్ బాక్స్

కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు

సిద్దిపేట కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 7,9,10వ తరగతి చదవడానికి ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంకా 13 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. తరగతుల వారీగా ఏడవ తరగతిలో మూడు సీట్లు, 9వ తరగతిలో మూడు సీట్లు, అలాగే పదవ తరగతిలో ఏడు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

హైకోర్టు జడ్జిని సత్కరించిన సీపీఎం నాయకులు

చేర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జడ్జిగా ఇటీవల నియమితులైన జనగామ ప్రాంతానికి చెందిన ఎస్.చలపతి రావును శనివారం చేర్యాల సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లాకార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి శాలువాకప్పి సత్కరించారు. ఆయనవెంట నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, దాసరి ప్రశాంత్, పవన్ కళ్యాణ్ ఉన్నారు.

కూల్చివేతలను కలెక్టర్ ఆపాలి

చేర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విస్తరణ పనుల పేరిట చేర్యాల పట్టణంలో చేపట్టిన రోడ్డుపక్కన గల ఇళ్లు, భవనాల కూల్చివేత ఆపివేయాలని, ఈ విషయంలో కలెక్టర్ హైమావతి చొరవ చూపి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కమిటీసభ్యుడు అందె అశోక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మానేపల్లి కిష్టయ్య, ఎల్లయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూళిమిట్ట పాఠశాలలో ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు ప్రారంభం

మద్దూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ఐఐటీతో దూళిమిట్ట ఉన్నత పాఠశాల భాగస్వామ్యం కావడంతో విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై హెచ్‌ఎం మాట్లాడారు. ఈ మేరకు మద్రాసు ఐఐటీ నుంచి కన్ఫర్మేషన్ లెటర్ వచ్చినట్లు తెలిపారు. దీంతో పదవ తరగతి లోనే విద్యార్థులు వివిధ ఫౌండేషన్ కోర్సులు పూర్తి చేయవచ్చని తెలిపారు ఈ కోర్సులకు మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్లు విద్యార్థులకు పాఠాలు చెబుతారని తెలిపారు.

దుద్దెడ కబడ్డీ క్లబ్ కార్యవర్గం

కొండపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ కబడ్డీ క్లబ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పెద్దంకుల శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శిగా రోశిలి కిషన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్, బాకి ప్రభాకర్, పిల్లి ఆగమల్లేష్, కొమ్ము మల్లిఖార్జున్ తదితరులు ఉన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గం

కుకునూరుపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందుల స్వామి, ఉపాధ్యక్షుడిగా అహ్మద్‌పాష, కార్యదర్శిగా శ్రీనివాస్, ట్రెజరర్‌గా నరసింహులుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలు

చిన్నకోడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరుతూ పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థినికి చేయూత...

బెజ్జంకి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని కర్ర భూమికకు ఉపాధ్యాయుడు అండగా నిలిచాడు. ఈ మేరకు శనివారం హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ బిగుల్ల బాబు ఆమెకు రూ. 6,500 ఆర్థికసాయం అందజేశారు. సదరు విద్యార్థిని తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందారు.

ఆగిన 'డబుల్' ఇళ్ల మాటేమిటి?

- పలు గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- ములుగు డబుల్ బెడ్రూంలలో ఉంటున్న నిర్వాసితులకు సర్టిఫికెట్లు అందక అసంతృప్తి
- 'డబుల్' ఇళ్ల పనులను పూర్తిచేయిస్తే నిరుపేదలకు ప్రయోజనం




బండ మైలారంలో అర్ధాంతరంగా ఆగిన డబుల్ బెడ్రూం ఇళ్లు, ములుగులో పంపిణీ చేసినా పట్టాలు మరిచిన ఇళ్లు

ములుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మండలంలో ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఈ మేరకు నాయకులు, అధికారులతో కలిసి ముగ్గులు పోసి ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పనులు వేగవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో తమకు వస్తాయనుకున్న డబుల్ బెడ్రూంలను ఎందుకివ్వడంలేదని మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో తమకు ఇల్లు రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

గ్రామాల వారీగా 'డబుల్' ఇళ్ల పరిస్థితి

ములుగు మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉండగా కొన్ని గ్రామాలలో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ములుగులో 188, క్షీరసాగర్, శ్రీరాంపూర్ 25, చిన్నమ్మాయపల్లి 25, అచ్చాయపల్లిలో 30, నాగిరెడ్డిపల్లిలో 25, బస్వాపూర్‌లో 23, బండ మైలారంలో 24 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో డబుల్‌బెడ్‌రూం నిర్మాణాలు చేపట్టలేదు. కాగా బండమైలారం, బస్వాపూర్ గ్రామాల్లో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో నిర్మాణం పనులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశాడు. అలాగే ములుగులో నిర్మించిన 188 డబుల్ బెడ్రూం ఇళ్లలో కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు కొన్ని ఇళ్లను ఇచ్చారు. ములుగు గ్రామానికి నిర్మించిన ఇళ్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంతో కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో ఉన్నవారికి సర్టిఫికెట్లు ఇవ్వలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో నిరుపేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

నిలిచిన పనులను పూర్తి చేయించాలి

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. అర్ధాంతరంగా ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను పూర్తి చేసినట్లయితే కొంతవరకు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో పేదలు కొండంత ఆశతో ప్రభుత్వం వైపు చూశారు. ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో వారి ఆశలు ఆడియాసలయ్యాయి. బండ మైలారం, బస్వాపూర్ గ్రామాల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని సంబంధిత కాంట్రాక్టర్‌లతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని ఆయా గ్రామాల్లోని నిరుపేదలు కోరుతున్నారు. ఈ విషయమై అధికార పార్టీ నాయకులు, అధికారుల చొరవ తీసుకుని వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



కోహెడ మండలంలోని కూరెళ్లలో బోనాలతో మహిళల ఊరేగింపు

ఘనంగా మహంకాళి బోనాలు

కోహెడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరెళ్ల గ్రామంలో మున్నూరు కాపు ఆధ్వర్యంలో మహంకాళీ బోనాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో తరలి వెళ్లి అమ్మవారికి మొక్కలు సమర్పించారు. అంతకు ముందు ప్రతీ మున్నూరు కాపు ఇంటి నుంచి బోనం తయారుచేసుకొని మహిళలు పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.



చేర్యాల: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు

వీరన్నపేటలో స్వాతినక్షత్ర పూజలు

చేర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలోని లక్ష్మీనృసింహ ఆలయంలో శనివారం స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు అష్టోత్తర శతఘటాభిషేకం, పంచసూక్త పఠనంతో హోమం జరిపారు. తులసీదళాలతో సహస్రనామపఠనం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను పల్లకిలో ఊరేగించారు. పవనసుత భజనమండలి సభ్యులు భజన చేపట్టారు.

ముగిసిన వారాహి నవరాత్రోత్సవాలు

చేర్యాల పట్టణ శివారులోని దుర్గమ్మ ఆలయంలో కొనసాగుతున్న వారాహి నవరాత్రోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దుర్గమ్మకు పూజలు నిర్వహించి కలశోద్వాసన చేశారు. వేడుకలలో భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి



చిన్నకోడూరులో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ



జగదేవ్‌పూర్: హోలీక్రాస్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

చిన్నకోడూరు. జూలై 5 (ఆంధ్రజ్యోతి) గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి సూచించారు. చిన్నకోడూరులో శనివారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు నార్కోటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడి చేసి రూ.2 వేల విలువ గల మద్యం సీసాలను, ఎలాంటి పేపర్లు లేని 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీపీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలను నడపవద్దన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్‌ఐలు బాలకృష్ణ, అపూర్వరెడ్డి, కనకయ్య, సైఫ్ అలీ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బెజ్జంకి/జగదేవ్‌పూర్: మండలంలోని వీరాపూర్ గ్రామంలో సైబర్ మోసాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై శనివారం ఎస్‌ఐ తిరుపతిరెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్‌ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శంకర్ రావు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని అల్లిరాజపేట్‌లో గల హోలీ క్రాస్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల గురించి ఎస్‌ఐ చంద్రమోహన్ అవగాహన కల్పించారు.

సహకార సంస్థలతో మెరుగైన ప్రపంచం

ములుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి మెరుగైన ప్రపంచాన్ని నిర్మించేందుకు సహకార సంస్థలు కృషి చేస్తున్నాయని పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ బట్టు అంజిరెడ్డి చేతులమీదుగా సహకార జెండాను ఎగురవేసి సహకార గేయాన్ని ఆలపించారు.

అంగన్‌వాడీ ఆయాలకు ఒకరోజు శిక్షణ



కుకునూరుపల్లి: మెదినీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న రిలయన్స్ సంస్థ ప్రతినిధులు

కుకునూరుపల్లి/మద్దూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి, మద్దూరు మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం రిలయన్స్, ఫై సంస్థల ఆధ్వర్యంలో ఆయాలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. కుకునూరు మండలంలోని మెదినీపూర్ అంగన్‌వాడీ కేంద్రం, దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి సెక్టార్‌లో, మద్దూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు ప్రీ స్కూల్ విధానంపై శిక్షణ నిర్వహించారు. చిన్నారులతో ఎలా ప్రవర్తించాలి, వారికి ఏ ఆహారాన్ని అందించాలి, ఏ విధమైన అక్షరాలను, బొమ్మలను చూపి నేర్పించాలో, అదే విధంగా టీచర్లకి ఏ విధమైన సహాయ సహకారాలు అందించాలో వివరించారు. పిల్లలకు టీచర్‌తో పాటు హెల్పర్ పాత్ర ప్రాముఖ్యత, తల్లిదండ్రుల భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడంలో హెల్పర్ పాత్రపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రేణుక, పుష్పలత, మాధవిరెడ్డి, ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్లు నవత, సరిత, పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ చైతన్యశ్రీ



హైదరాబాద్‌లో చైతన్యశ్రీని అభినందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట అంధ్రజ్యోతి, జూలై 5: జాతీయ స్థాయి అండర్ 17 ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారిణి చైతన్యశ్రీని మాజీమంత్రి హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. జాతీయ మహిళా ఫుట్‌బాల్ టీంలో ఎంపికై సిద్దిపేట పేరు నిలబెట్టాలంటూ ఆకాంక్షిస్తూ అల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సాజిద్, చైతన్యశ్రీ తండి రాము తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఉత్సవాలకు ఆహ్వానం

సిద్దిపేట రూరల్: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే కనకదుర్గాదేవి ప్రథమ వార్షికోత్సవానికి మాజీమంత్రి హరీశ్‌రావును మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో సంఘం ప్రతినిధులు మాజీమంత్రికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆహ్వానించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ ఒగ్గు మురళీ, సంఘం ప్రతినిధులు దేశెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఎఫ్‌ఎం ఏర్పాటు చేయాలి



కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి పత్రం అందిస్తున్న ఫిలిం బోర్డు సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల

హుస్నాబాద్‌రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ద్వారా హుస్నాబాద్ పట్టణంలో ఎఫ్‌ఎం రేడియో ట్రాన్స్‌మీటర్ ఏర్పాటు చేయాలని హుస్నాబాద్‌కు చెందిన ఫిలిమ్ బోర్డు సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కరీంనగర్‌లో వినతి పత్రం అందజేశారు. వెంట మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, బీజేపీ హుస్నాబాద్ పట్టణ కార్యదర్శి రాయికుంట చందు ఉన్నారు.

● **కోహెడ:** బీజేపీ కోహెడ మండల పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గుగ్గిళ్ల శ్రీనివాస్ మాతృమూర్తి బస్మవ్వ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కేంద్రమంత్రి బండి సంజయ్ గుగ్గిళ్ల శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా పరామర్శించి, ధైర్యం చెప్పారు.

నర్సారెడ్డిని విమర్శించే హక్కు బీజేపీకి లేదు

గజ్వేల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని విమర్శించే నైతికహక్కు బీజేపీ నాయకులకు లేదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఓడిపోయినా ప్రజల్లోనే నిత్యం ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నర్సారెడ్డిపై బీజేపీ నాయకులు అవాకులు, చవాకులు పెలడం సరికాదన్నారు. నర్సారెడ్డిని మరోసారి విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు మోహన్నగారి రాజు, నక్క రాములు గౌడ్, సుఖేందర్‌రెడ్డి ఉన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించుకోవాలి



గొల్లపల్లిలో మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో కందకాలు, ఇంకుడు గుంతలు, రాతి కట్టడాలు ఏర్పాటు చేసుకుంటే నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకుతూ భూగర్భ జలాలు పెంపొందించుకునేందుకు దోహదపడతాయని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. శనివారం అక్కన్నపేట మండలంలోని గొల్లపల్లిలో రైతులకు భూమిలో తేమ, నీటి నిల్వలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. సదస్సులో సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు కనకం రవీందర్, భూక్య బిచ్చ, ముడవతు తిరుమల, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు మంచి జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లాకు తెలంగాణ పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. మండలంలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బందికి శనివారం నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, రాజేశ్, విష్ణు ప్రసాద్, పూర్ణ చందర్, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, పోలీసు, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సర్దుబాటు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడి డిమాండ్ చేశారు. బడిబాటలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరిన పాఠశాలలను విద్యాశాఖ గుర్తించాలన్నారు. టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ శనివారం సిద్దిపేట ఉపాధ్యాయభవన్‌లో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజయేందర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖలో పర్యవేక్షణ అధికారాలు ఎంఈవోలకు మాత్రమే ఉండాలని, ఉపాధ్యాయుల ద్వారా పర్యవేక్షణ చేయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నరేందర్ జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, రామ్‌రెడ్డి, పాపిరెడ్డి, నరసింహారెడ్డి, శివాజీ మల్లేశం, సత్య కృష్ణ, శ్రీనివాస్, రాములు, అజీజ్, రాష్ట్ర కౌన్సిలర్‌లు రాజులు, జమీర్ మోహియోద్దీన్, రామస్వామి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్ర అభివృద్ధికి సహకారం: డీసీసీ అధ్యక్షుడు



అభినందన సభలో మాట్లాడుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలం నాచగిరి క్షేత్రంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన ఆలయ పాలక మండలికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం రూ. 100 కోట్లతో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌తో సీఎం దృష్టికి తెచ్చి నాచగిరి క్షేత్రాన్ని యాదద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆలయ పాలక మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తాతో పాటు ఇతర సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా అభినందన సభలో జిల్లా ఆర్య వైశ్య సంఘం నాయకులతో పాటు గజ్వేల్, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్ మండలాల ఆర్యవైశ్య సంఘం నాయకులు చైర్మన్‌గా ఎన్నికైన పల్లెర్ల రవీందర్ గుప్తా, సభ్యుడిగా నియామకమైన జగ్గయ్యగారి శేఖర్, చంద నాగరాజులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం



రుద్దూరులో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు/కొమురవెల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకంతో సాకారం కానున్నట్టు ఆ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని చిలుక వెంకటమ్మకు మంజూరైన ఇంటి నిర్మాణానికి స్థానిక మండల పార్టీ అధ్యక్షులు మేక మల్లేశం, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు షౌకత్‌అలీతో కలిసి ముగ్గుపోసి భూమిపూజ చేశారు. అదేవిధంగా కొమురవెల్లి మండల కేంద్రంలో పలు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయా మండలాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు దగ్గరుండి ప్రారంభించేలా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. వెంట ఆయా మండలాల అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు ఉన్నారు. కాగా చేర్యాలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సాయపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి నర్సింహారెడ్డి కుటుంబాన్ని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు: నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 6, 7వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మొత్తం 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మెజారిటీ గ్రామాల్లో పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

చేర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ శనివారం చేర్యాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండు నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్పొరేట్‌కు పట్టం కట్టి విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం తగదన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

నంగునూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య విమర్శించారు. శనివారం నంగునూరులో విలేకరుల సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్ రెడ్డి, దువ్వల మల్లయ్యతో కలిసి మాట్లాడారు. సమావేశంలో కోల రమేష్ గౌడ్ పాల్గొన్నారు.